


టాగోర్ కథలు

తెలుగు సేత: చంద్రలత



నల్ల గుమ్మడి కాయ్! పచ్చి మిరపకాయ్ ! రవీంద్రనాథ టాగోర్

రచన : రవీంద్రనాథ్ ఠాగూర్ , ఇందురేర్ భోజ్ Imdurēra bhōja ,(ఎలుకల విందు, బెంగాలీ, 1941)



"అరరే, ఇది అన్యాయం రా! మనం ఆ కొత్త పంతులు దగ్గర చదవడం వీలు పడదంటే పడదు! అంతే!" అబ్బాయిలు అందరూ ఒక్క గొంతుతో అరిచారు!

ఆ రాబోయే కొత్త పంతులుకి ఒక పేరుంది — కాళీకుమార్ తర్కాలంకార్ అని. ఇప్పటిదాకా ఆ కొత్త పంతులిని చూడకపోయినా, పిల్లలు అతనికి ఒక సరదా పేరు పెట్టేశారు — "నల్ల గుమ్మడికాయ్! పచ్చి మిరపకాయ్!" అని.

ఇక, పిల్లల వెక్కిరింతలు, కొక్కిరింతలు వారి నవ్వులతో కలగలసి పొంగిపొర్లుతున్నాయి.

ఆ రాబోయే పంతులు గారి పేరుని విరక్కొట్టి, అతికించిన బెంగాలీ ఉచ్చారణను మెలికలు తిప్పి, పదాలకు కొత్త అర్థాలు అంటగట్టేశారు. అలా, కాళీకుమార్ తర్కాలంకార్ గారు కాస్తా — కాలీ (నల్ల), కుమ్రో (గుమ్మడి), తర్కా (తాజా), లొంకార్ (మిరప) గా మారిపోయారు అన్నమాట.

ఆ అల్లరిపిల్లలు తమ బడికి రాబోయే కొత్త పంతులు గారి పేరుని అలా కోసి, కూర వండేశారన్న మాట!

ఆ తుంటరి పిల్లల నోళ్లల్లో నలిగి నలిగి, 'నల్ల గుమ్మడికాయ్! పచ్చి మిరపకాయ్!' గారు బోలెడు ఘనత వహించేశారు!

సెలవలు పూర్తయ్యాయి. ఆ పిల్లలు మళ్లీ తమ తమ ఇళ్ల నుంచి రైలు ఎక్కి, వారి బడికి బయలుదేరారు.

వాళ్లల్లో ఒకానొక కొంటె పిల్లవాడు ఏకంగా "నల్ల గుమ్మడికాయ బలిదానం" అన్న కవితనే రాసుకొచ్చాడు.

ఇక, కోతికి కొబ్బరికాయ దొరికినట్లయ్యింది. పిల్లలందరూ రైలుపెట్టె దద్దిరేలా పెద్దగా ఆ కవితాగానం చేస్తున్నారు.

సరిగ్గా అప్పుడే, రైలుబండి గుప్పు గుప్పున పొగ వదులుతూ వచ్చి, ఆద్ధోలా స్టేషన్లో ఆగింది.

ఒక పెద్దమనిషి ఆ పిల్లలున్న రైలు పెట్టెలోకి ఎక్కి, కూర్చునే ప్రయత్నం చేశాడు. అతనితో పాటే ఒక మడతేసిన పరుపు చుట్ట, కొన్ని బట్టముక్కలతో వాసెన కట్టిన జాడీలు, ఒక ట్రంకు పెట్టె, ఇంకా కొన్ని మూటలు ఉన్నాయి.

ఒక కొండేల కొరివి తరహా పిల్లవాడు, అందరూ 'తేలు కొండి' అని పిలిచే బిచ్కన్, బిగ్గరగా గర్జించాడు.

"ఇక్కడ స్థలం లేదు, ముసలాయనా! పద, పద! ఇంకో పెట్టెలోకి వెళ్ళు!"

ఆ పెద్దమనిషి అన్నాడు, "రైలంతా చాలా రద్దీగా ఉంది. ఎక్కడా కూర్చోవడానికి చోటు లేదు. ఏదో ఒక మూల సర్దుకొని కూర్చుంటాను. మిమ్మల్ని ఏ ఇబ్బందీ పెట్టను."

అలా అంటూనే, పిల్లల మధ్యలో తను కూర్చున్న సీటును ఖాళీ చేశాడు. అదే పెట్టెలో ఒక మూల తన పరుపును కింద పరుచుకొని కూర్చున్నాడు.

అతను పిల్లలను అడిగాడు, "మీరంతా ఎక్కడికి వెళుతున్నారు? ఎందుకు?"

బిచ్కన్ టపీమని జవాబు ఇచ్చాడు.

"తద్దినం పెట్టడానికి!"

"ఎవరి తద్దినం?"

"నల్ల గుమ్మడికాయ్ పచ్చి మిరపకాయ్ కి!" అతని సమాధానం అతనికి వినబడింది.

అబ్బాయిలందరూ మళ్లీ ఒకసారి తమ గొంతులు చిల్లులు పడేలా అరిచారు.

"ఓ నల్ల గుమ్మడికాయ్ పచ్చి మిరపకాయ్! నీ సంగతి మేం చూసుకొంటాం!"

ఇంతలో, రైలు ఆసనోల్ స్టేషన్లో ఆగింది.

పెద్దమనిషి స్నానం చేయడానికి బండి దిగి వెళ్ళాడు.

ఆయన స్నానం చేసి తిరిగి వచ్చి రాగానే, బిచ్కన్ మళ్లీ హెచ్చరించాడు,

"మిష్టర్! ఈ రైలు పెట్టెలో ఇక ఉండొద్దు!"

"ఎందుకో చెప్పండి బాబూ," ఆ పెద్దమనిషి సౌమ్యంగా అడిగాడు.

"ఈ పెట్టెలో బోలెడు ఎలుకలు ఉన్నాయి!" టక్కున జవాబు వచ్చింది.

"ఎలుకలా? ఇప్పుడు ఎలుకల గురించి ఎందుకు మాట్లాడుతున్నారు?"

"మీ జాడీలకు కట్టిన బట్ట పేలికలను చూడండి. ఆ ఎలుకలు ఏం చేశాయో!"

ఆ పెద్దమనిషి తీపి పిండివంటల జాడీల వంక చూశాడు.

ఏముందక్కడ? అన్నీ ఖాళీ! హాం ఫట్!

బిచ్కన్ తేటగా అన్నాడు, "ఆ ఎలుకలు మీ మూటను కూడా లాక్కెళ్ళాయి! చూడండి!"

ఆ మూటలో ఆ పెద్దమనిషి తోటలో పండిన మామిడిపళ్లు ఉన్నాయి.

ఆ పెద్దమనిషి నవ్వి అన్నాడు, "నిజమే, ఆ ఎలుకలు బాగా ఆకలి మీద ఉన్నట్టున్నాయి!"
బిచ్కన్ తిరిగి అన్నాడు, "ఎలుకలు అంటే అంతే! ఆకలి లేకపోయినా తినేస్తాయి!"
మిగిలిన పిల్లలు కూడా ఈ వేళాకోళానికి జత చేరి, పడీ పడీ పగలబడి నవ్వారు.
"నిజం మిష్టర్! ఇంకా కొన్ని పిండివంటలు ఉంటే, అవన్నీ కూడా తినేసేవి!"
"నేను పొరపాటు చేశాను, అయ్యో! నాతో పాటు రైలులో ఇన్ని ఎలుకలు ప్రయాణం చేస్తున్నాయని ముందుగా తెలిస్తే ఎంత బావుండేది! ఇంకా మంచి మంచి పిండివంటలు వండించుకు తెచ్చేవాడిని కదా!" అన్నాడు అతను.
అబ్బాయిలు ముఖాముఖాలు చూసుకొన్నారు. ఆ పెద్దమనిషి తాము చేసిన కొంటె పనికి కోపంతో విరుచుకుపడితే సరదాగా ఉండేది. ఇప్పుడు మరోలా జరిగింది. అబ్బాయిలు బోలెడంత నిరాశ పడ్డారు.
రైలు వర్ధమాన్ స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ రైలు ఒక గంట సేపు ఆగుతుంది. ప్రయాణీకులందరూ వారి వారి రైళ్లల్లో ఎక్కి, ఎవరి ఊళ్లకు వాళ్లు వెళతారు. ఆ అబ్బాయిలు, ఆ పెద్దమనిషి కూడా వేరే రైలు ఎక్కాల్సిందే.
"అబ్బాయిలూ, ఇక మిమ్మల్ని నేను ఇబ్బంది పెట్టను. వేరే పెట్టెలో చోటు చూసుకొంటా," అన్నాడా పెద్దమనిషి.
"వద్దు... వద్దు!" అబ్బాయిలు ఒక్క గొంతుతో అరిచారు. "మీ ప్రయాణం మీరు మాతోనే పూర్తిచేయాలి. మీ జాడీల్లో ఏమైనా మిగిలి ఉంటే, మేము వాటిని జాగ్రత్తగా కాపలా కాస్తాం. ఈసారి అవి ఎక్కడికి పోవు."
"సరే పిల్లలూ, మీరు రైలు ఎక్కి కూర్చోండి. నేను ఇప్పుడే వస్తా!" ఆ పెద్దమనిషి అన్నాడు.
పిల్లలు వాళ్లు తరువాత ఎక్కాల్సిన రైలులోకి ఎక్కి కూర్చున్నారు.
కొద్దిసేపటి తరువాత, చిరుతిళ్లు అమ్మే అతను తన బండిని నెట్టుకొంటూ పిల్లలు ఉన్న పెట్టె కిటికీ దగ్గరికి వచ్చి ఆగాడు. ఆ వెనకే ఆ పెద్దమనిషి కూడా వచ్చాడు. అతను ఆ బండి మీద నుంచి తీసి, పిల్లలందరికీ తలా ఒక మిఠాయి పొట్లం అందించాడు.
"ఈసారి ఎలుకలు తమ విందు భోజనంలోకి ఏ మిఠాయిలూ సరిపోలేదు అని అనుకోకూడదు!" అని అన్నాడు.
ఇంతలో, మామిడిపళ్లు అమ్మే మనిషి అక్కడికి వచ్చాడు.
తియ్యతియ్యని మామిడిపళ్లు కూడా పిల్లల దగ్గరకు చేరిపోయాయి.
"నీవు ఎక్కడికి వెళుతున్నావు? దేని కోసం వెళుతున్నావు?" పిల్లలు గట్టిగా గద్దించి అడిగారు.
"నేను ఉద్యోగం కోసం వెతుకుతున్నాను. ఎక్కడ పని దొరుకుతుందంటే అక్కడ దిగేస్తాను!"
"ఎలాంటి పని చేస్తావు?" పిల్లలు మరింత గద్దించి అడిగారు.
"నేను ఒక ఉపాధ్యాయుణ్ణి. నేను సంస్కృతం నేర్పిస్తాను," ఆ పెద్దమనిషి అన్నాడు.
పిల్లలు సంతోషంగా చప్పట్లు కొట్టారు. ఒక్క గొంతుతో అన్నారు,
"అయితే, మీరు మా బడికి రావాలి!"

"మీ బడిలో నాకు ఎందుకు ఉద్యోగం వస్తుంది?" అతను అడిగాడు.

"మా బడి మీకు ఉద్యోగం ఇవ్వాల్సిందే! ఆ నల్ల గుమ్మడికాయ్ పచ్చి మిరపకాయ్ ని బడి ఆవరణలో అడుగు పెట్టనియ్యం గా!" పిల్లలు ముక్తకంఠంతో అరిచారు.

"మీరు నన్ను సందిగ్ధంలో పడేశారు! మీ బడి సెక్రటరీ గారికి నేను నచ్చకపోతే?" ఆ పెద్దమనిషి తెలుసుకోవాలని అడిగాడు.

"వారికి మీరు నచ్చాల్సిందే! లేకపోతే మేమందరం బడిని వదిలి వెళ్ళిపోతాం!" వాళ్లు అన్నారు.

"సరే అబ్బాయిలూ, నన్ను మీ బడికి తీసుకు వెళ్ళండి."

రైలు వారు దిగాల్సిన చోటుకి చేరుకుంది.

వాళ్ల బడి సెక్రటరీ స్వయంగా స్టేషన్‌కు వచ్చారు.

ఆ పెద్దమనిషిని చూడగానే, అతను అన్నాడు,

"నమస్కారం. రండి, రండి, తర్కాలంకార్ గారు. చక్కగా సర్దించిన మీ గది మీకోసం సిద్ధంగా ఉన్నది!"

సెక్రెటరీ గారు తిన్నగా వచ్చి, ఎంతో గౌరవంతో తర్కాలంకార్ గారి పాదాలను నమస్కరించారు.

★



అనుసృజకుల వ్యాఖ్యానం

అల్లరి పిల్లల జన్మహక్కు. ఆ అల్లరి పిల్లల అభిమానం పొందగలిగిన నైపుణ్యం పంతుళ్ళకు ఉండాలి.

అవి పొగబండి రోజులు. అవి, "దండనం దశ గుణ భవేత్" అని నమ్మే రోజులు. ఆ పిల్లలు అమ్మానాన్నలకు, ఇంటికి దూరంగా, గురుకుల విద్యలోకి వెళ్ళడంలో కలిగే ఎడబాటు ఆందోళన (Seperation Anxiety), తెలియని కొత్త పంతులు గురించి వాళ్ళలో కలిగిన భయసంకోచాలు (Stranger Fear) మొదలనవి సహజం.

అలాంటి సందర్భంలో, తనను ఆట పట్టించిన పిల్లలే తనను అభిమానించేట్టు ఆ పంతులు ఎలా మలుచుకొన్నారన్నది కథ "నల్ల గుమ్మడి కాయ్! పచ్చి మిరపకాయ్ !"

— "ఎలుకల విందు" (ఇందురేర్ భోజ్ — Imdurēra bhōja, బెంగాలీ, 19

COMMENTS